ARK MEDIA
SUBSCRIBE

TS 24 0026809
నేటి ప్రభాతదర్శిని
మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం
ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి
జాతీయ తెలుగు దినపత్రిక
www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 264 | గురువారం, అక్టోబర్ 15, 2026 | పేజీలు : 04 | వెల రూ. 2.00/

విలేఖరులు కావలెను
అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..
నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...
నియోజకవర్గ ఇంచార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను..
సంప్ర : 94932 72754

# కరెంట్ కోతలపై రేవంత్‌రెడ్డి ఆగ్రహం

**అధికారుల నిర్లక్ష్యంపై సీఎం తీవ్ర అసహనం**
**స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీకి సస్పెన్షన్ హెచ్చరిక**
**విద్యుత్ ఉత్పత్తి పెంపుపై నిలదీత**
**యూకే మేయర్ల బృందంతో పెట్టుబడులపై చర్చలు**
**ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు ఆహ్వానం**

**హైదరాబాద్, అక్టోబర్ 14(నేటి ప్రభాతదర్శిని):**

తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తూ, పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని హెచ్చరించారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై నిర్వహించిన సమీక్షలో భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీలు ఉన్నప్పటికీ విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. ప్రజలు విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు పడకుండా చూడాలని, నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జెన్‌కో సీఎండీ సహా బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విద్యుత్ కోతలకు గల



కారణాలపై తక్షణమే నివేదిక సమర్పించాలని, సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ మేయర్ల ప్రతినిధి బృందం కలిసి తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించింది. హెల్త్‌కేర్, డిజిటల్ సాంకేతికత, రక్షణ, ఏరోస్పేస్, వస్త్ర పరిశ్రమలు, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా 'యూకే--ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్' అంశంపై యూకే--ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026'కు హాజరుకావాలని యూకే ప్రతినిధులను ఆహ్వానించారు.

# ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

**ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహణ**
**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ -14**

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు (అంటే జాబితాలో చేరని వారు) మొదటిసారి ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే యువకులు ఈ నిర్దేశిత కేంద్రాలను సందర్శించి, ఓటర్ల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి 'ఫారం-6' ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైన పేర్కొన్న రోజుల్లో సంబంధిత బీ ఎల్ ఓ లు బీ ఎల్ ఏ లు ఆయా నిర్దేశిత కేంద్రాలలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈ నెల 15.10.2026 (గురువారం), 16.10.2026 (శుక్రవారం) ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వెల్లడించారు.



# అంగన్వాడి టీచర్ల, ఆయాల పోస్టుల దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలి



**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ అక్టోబర్ 14, 2026:**

జిల్లాలోని 5 ఐ సి డి ఎస్ ప్రాజెక్టుల క్రింద ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాల పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, దరఖాస్తుతో పాటు జతపరిచిన దృవపత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణితో కలిసి ఐ సి డి ఎస్ సి డి పి ఓ లు, సూపర్వైజర్లు, సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన అంగన్వాడీ టీచర్ల, ఆయాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, భారీగా దరఖాస్తుల వచ్చే అవకాశం ఉందని, ప్రతి దరఖాస్తులు సి డి పి ఓ లు, సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో ధ్రువపత్రాలను పరిశీలించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారి విద్య అర్హత వివరాలు, వయసు, స్థానికత, రిజర్వేషన్, వితంతువులు, అనాథలు, దివ్యాంగులు వంటి వివరాల దృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చార్మినార్ జోన్ (డిసిపి) కార్యాలయం ఎదుట భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ధర్నా



**నేటి ప్రభాత దర్శిని! హైదరాబాద్. చార్మినార్!**

గణేష్ మండప నిర్వాహకులపై నమోదు చేసిన కేసులను బే షరతుగా ఉపసంహరించుకోవాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు . ఈ మేరకు గణేష్ ఉత్సవ సమితి సౌత్ జోన్ శాఖ ఆధ్వర్యంలో పురాణ హవేలీలోని చార్మినార్ జోన్ డిసిపి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ ,భాగ్యనగర్ బిజెపి అధ్యక్షుడు జే. నిరంజన్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ జి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేందర్, ఉత్సవ సమితి కార్యదర్శి కోడి మహేందర్, ఉపాధ్యక్షులు రూప్ రాజ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత నగర పోలీసుల వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ హిందూ యువకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని వారు ఆరోపించారు. గణేష్ ఉత్సవాలను స్వేచ్ఛ గా నిర్వహించుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతపరమైన ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించు కునే హక్కుకు భంగం కలగకుండా పోలీసులు వ్యవహరించాలని వారు కోరారు. గణేష్ మండప నిర్వాకులపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఎలాంటి షరతులు లేకుండా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను అధికారులు పరిగణలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పారదర్శకంగా భూముల రీ సర్వే పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**





**నేటి ప్రభాతదర్శిని కరీంనగర్ అక్టోబర్ 14 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ఎలాంటి పొరపాట్లకూ తావు లేకుండా, పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. భూభారతి ప్రక్రియలో భాగంగా భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేపై అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కొనసాగుతున్న 70 గ్రామాల్లో అత్యంత పారదర్శకంగా నిర్దిష్ట గడువులోగా భూ సర్వే పూర్తి చేయాలని అన్నారు. భూముల హద్దులు, విస్తీర్ణం, సర్వే నెంబర్లు తదితర వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చి చూడాలన్నారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు వివాదాలు, ఇతర అంశాల్లో ఉన్నతాధికారుల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా సర్వే బృందాల సభ్యులకు ఆధునిక రోవర్ యంత్రాల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వివిధ ఫారాలు, ఆన్లైన్ నమోదు దగ్గర వివరాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు షర్మిల జల కుమారి, లైసెన్సుడ్ సర్వేయర్లు, సర్వేయర్లు, తహసిల్దార్లు,డిప్యూటీ తహసిల్దార్లు, ఆర్ ఐ లు, జి పి ఓ లు పాల్గొన్నారు.

# ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంపై సమీక్ష

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన



**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని. ప్రతినిధి. అక్టోబర్ 15.26**

ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి (రాజూణఖీ) వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద బడ్జెట్ విడుదల, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, నిధుల వినియోగం, వివిధ శాఖల ద్వారా చేపట్టిన కార్యక్రమాల అమలు తీరు, పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. శాఖల వారీగా నిధుల కేటాయింపులు, ఖర్చుల వివరాలను పరిశీలించి, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, శిక్షణ కలెక్టర్ రవి తేజ, జిల్లా ప్రణాళిక అధికారి రఘునందన్, జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, మత్స్యశాఖ అధికారి లాయక్ మోయినుద్దీన్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేష్ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తల సేమియా వ్యాధి చిన్నారులకు రక్తాన్ని అందజేసి వారి ప్రాణాలను కాపాడండి

కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర గారికి వినతి

ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు




**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని. ప్రతినిధి. అక్టోబర్ 15.26**

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరాలలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు కావలసిన రక్తాన్ని అందజేసి వారి ప్రాణాలను కాపాడాలని జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్పీ రాజేష్ చంద్ర కి విజ్ఞప్తి చేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు,తెలంగాణ రాష్ట్ర ఫార్మ కౌన్సిల్ సభ్యులు చిలువేరి మారుతి లు తెలియజేయడం జరిగింది. తల సేమియా బాధిత చిన్నారులకు జీవితాంతం ప్రతి 15 రోజులకు ఒక యూనిట్ రక్తం అవసరం ఉంటుందని,అలాంటి చిన్నారులు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 6 వేలకు పైగా ఉన్నారని,ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 200 పైగా చిన్నారులు ఈ వ్యాధితో బాధపడుతున్నారని వారి ప్రాణాలను కాపాడాలంటే సకాలంలో రక్తాన్ని అందజేయాల్సిన అవసరం ఉంటుందని,ఈ వ్యాధి చిన్నారులు వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను జిల్లా ఎస్పీ కి వివరించడం జరిగింది.తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు కావలసిన రక్తాన్ని అందజేయడానికి జిల్లా పోలీసు శాఖ తరపున సహకరిస్తామని ఎస్పీ గారు తెలియజేయడం జరిగింది జిల్లా ఎస్పీకి తల సేమియా బాధిత చిన్నారుల కుటుంబాల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్ కుమార్ లు పాల్గొనడం జరిగింది.

# గొల్లపల్లిలో ఉత్తరప్రదేశ్ వాసి దారుణ హత్య

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 14(కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని):**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన టైల్స్ కాంట్రాక్టర్ పవన్ సింగ్ (35) హత్యకు గురయ్యాడు. కూలీలతో తలెత్తిన గొడవ హత్యకు దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా గొల్లపల్లిలో నివాసం ఉంటూ టైల్స్ పనులు చేస్తున్న పవన్ సింగ్.. రాజస్థాన్‌కు చెందిన జోగేందర్, బీహార్‌కు చెందిన శివం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్, షకీల్‌లతో కలిసి ఏరుపుల దేవయ్యకు చెందిన అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం ఉదయం పవన్ సింగ్ జోగేందర్, శివంలను వెంటబెట్టుకుని మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌కు టైల్స్ పనుల నిమిత్తం వెళ్లినట్లు సమాచారం. ధర్మేందర్‌ను ఎల్లారెడ్డిపేటకు, షకీల్‌ను అక్కపల్లికి పనుల కోసం పంపినట్లు షకీల్ తెలిపాడు. మాచారెడ్డికి వెళ్లిన పవన్, మరో ఇద్దరు మధ్యాహ్నం సమయంలో గొల్లపల్లిలోని అద్దె ఇంటికి తిరిగి వచ్చి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఇంట్లో గొడవ జరుగుతోందని సమాచారం అందడంతో ఇంటి యజమాని రాములు అక్కడికి వెళ్లి చూడగా గదికి తాళం వేసి ఉంది. లోపల పవన్ సింగ్ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటేష్, ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసి, ఛాతీపై రెండు మూడు చోట్ల పొడిచి పవన్ సింగ్‌ను హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఘటన అనంతరం జోగేందర్, శివం మృతుడి సెల్‌ఫోన్‌తో అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల అసలు కారణాలు, గొడవకు దారితీసిన పరిస్థితులపై షకీల్‌ను విచారిస్తున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేష్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు.

# ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి





జిల్లా కలెక్టర్. ఆశీష్ సంగ్వను

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్ 15.26.**

ఉపాధి పనుల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఉపాధి పనులు, కూలీల హాజరుపై ప్రతిరోజూ పర్యవేక్షణ చేపట్టాలి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటించాలి. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి కల్పించాలి– రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు కొత్త అంచనాలను త్వరితగతిన రూపొందించాలి. కామారెడ్డి జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు ఉపాధి కల్పన, మ మేట్ ల నియామకం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి కల్పన, రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కొత్త అంచనాల తయారీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉపాధి పనులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి గ్రామ పంచాయతీలో రోజువారీగా సగటున 60 మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీలు, ఆవాసాల్లో ఉపాధి పనులు ప్రారంభించి, పని కోరే కుటుంబాలకు నిరంతరం ఉపాధి కల్పించాలని సూచించారు.

**అధికారులు సమయపాలన పాటించాలి**

ఉపాధి పనుల నిర్వహణలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజినీరింగ్ సలహాదారులు, సాంకేతిక సహాయకులు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకల్లా విధులకు హాజరై, గ్రామాల్లో పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి పర్యవేక్షించాలని ఆదేశించారు. క్షేత్ర సహాయకులు, మేటీలు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకల్లా విధుల్లో చేరి, కూలీలను సమీకరించి ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

**ఉపాధి కల్పనలో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి**

ఉపాధి పనుల్లో కూలీల హాజరు తక్కువగా నమోదవుతున్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో వెనుకబడిన మండలాల పనితీరును సమీక్షించి, అవసరమైన చోట అధికారుల నుంచి వివరణ కోరాలని సూచించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, అదనపు కార్యక్రమ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కూలీల సమీకరణను పర్యవేక్షించాలని, ప్రతిరోజూ కూలీల హాజరును సమీక్షిస్తూ లక్ష్యాల సాధనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**మెట్ ల నియామకం, పనితీరుపై నిరంతర పర్యవేక్షణ**

అన్ని గ్రామ పంచాయతీల్లో సమర్థవంతంగా పనిచేసే మెట్ లను గుర్తించి నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మెట్ లు ప్రతిరోజూ కూలీలను సమీకరించి, పనులు సక్రమంగా జరిగేలా చూడాలని, వారి పనితీరును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 90 రోజుల వేతన ఉపాధి**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల వేతన ఉపాధి కల్పించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. గృహ నిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు కొత్త అంచనాలు సిద్ధం చేయాలి**

రెండో విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి పనులు కల్పించేందుకు అవసరమైన కొత్త అంచనాలను త్వరితగతిన రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల గుర్తింపు, అంచనాల తయారీ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఉపాధి పనుల అమలును మరింత మెరుగుపరిచి, ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు సగటున 60 మంది కూలీలకు ఉపాధి కల్పించే లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమయపాలన పాటిస్తూ కూలీల సమీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారి విజయ్ పాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి మురళి, సీఈఓ చందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేను రాను బిడ్డో... బాన్సువాడ సర్కారు దవాఖానకు!

వైద్యుల నిర్లక్ష్యంతో నిండు గర్భిణుల పాలిట శాపంగా మారిన ఏరియా ఆసుపత్రి

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి**

ఒకప్పుడు రెండు నియోజకవర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించి అవార్డులు అందుకున్న బాన్సువాడ ఏరియా ఆసుపత్రి, ఇప్పుడు వరుస నిర్లక్ష్య ఘటనలతో అపఖ్యాతి పాలవుతోంది. దీంతో "బాన్సువాడ సర్కారు దవాఖానకు రావాలంటేనే జనం జంకుతున్నారు" అనే పరిస్థితి నెలకొంది.

**రెండు నెలల క్రితం 5 గురు గర్భిణులకు ముప్పు:**

రెండు నెలల క్రితం 5 మంది గర్భిణులకు ఆపరేషన్లు వికటించడంతో వారి పరిస్థితి విషమించింది. దీంతో వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాల్సి వచ్చింది. ఈ ఘటనపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్వయంగా ఆగ్రహం వ్యక్తం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకున్నారు.

**తాజాగా గర్భంలోనే శిశు మృతి:**

అది మరువక ముందే తాజాగా అక్టోబర్ 9న మరో దారుణం జరిగింది. బిచ్కుంద మండలం పుల్కల్ కు చెందిన గర్భిణి నాగరాణిని బిడ్డ కదలికలు లేకపోవడంతో ఆసుపత్రికి వి తీసుకొస్తే, వైద్యులు సరిగా పట్టించుకోకుండా గ్లూకోజ్ ఎక్కించి పంపించారని, తీరా ప్రైవేట్ ఆసుపత్రిలో చూపిస్తే అప్పటికే గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు తేలిందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.




**అవార్డుల నుంచి అభాసుపాలు:**

ఒకప్పుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే ఉత్తమ సేవలు అందించిన ఆసుపత్రిగా గుర్తింపు పొందిన బాన్సువాడ ఏరియా ఆసుపత్రి, ఇప్పుడు వరుస వివాదాలతో "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు" అని గర్భిణులు భయపడే పరిస్థితికి చేరడం విచారకరమని స్థానికులు వాపోతున్నారు. వైద్య శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎండిన వరి పంట - రైతులను ఆదుకోవాలి

బి ఆర్ ఎస్ నాయకులు





కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని గట్టుమీది గ్రామా లైన కోనాపూర్, కథలాపూర్, హన్మాజీపేట్, సంగోజిపేట్ గ్రామాలలో ఎండిపోయిన వరి పంటలను బుధవారం బిఆర్ఎస్ నాయకులు దుద్దాల అంజిరెడ్డి, మోరల్ శ్రీనివాస్ రావు లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారుగా 200 ఎకరాల్లో వరి పంట ఎండిపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని అన్నారు. అనంతరం కోనాపూర్ సబ్‌స్టేషన్ లో రైతులతో కలిసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ వర్షాలు కూవకపోవడంతో పాటు రైతులకు విద్యుత్ సరఫరా కనీసం 16, 17 గంటల విద్యుత్తును ఇస్తే పంటలు ఎండిపోయేవి కావని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు 16 గంటల కరెంటు నిరంతరాయంగా ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందేలా కృషి చేస్తామని రైతులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రైతులు ధైర్యాన్ని కోల్పోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శివ సూరి, వసంత్ రావు, అమిరొద్దీన్, భుజంగం రావు, లక్ష్మణ్, శంకర్ గౌడ్, గంగారాం సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహార పథకం అమలుకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి. జిల్లా కలెక్టర్

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్ 15.26.**

కేంద్రీకృత వంటశాల ఏర్పాటుకు ఏడు రోజుల్లోగా గోదాంను ఖాళీ చేయాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించే పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పథకం అమలు, ఆహార తయారీ, సరఫరా, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షించారు. ప్రభుత్వ స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రాథమిక పూర్వ విద్య నుంచి పన్నెండో తరగతి వరకు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా పాల్వంచ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో కేంద్రీకృత వంటశాల ఏర్పాటు చేసే అంశంపై అధికారులతో చర్చించారు. పాల్వంచ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో ప్రస్తుతం నిల్వ ఉన్న ధాన్యాన్ని ఏడు రోజుల్లోగా ఖాళీ చేయించి, కేంద్రీకృత వంటశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారాన్ని సకాలంలో అందించేందుకు అవసరమైన వసతులు, ఆహార తయారీ, సరఫరా ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పౌర సరఫరాలు, విద్య, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పథకం అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బతుకమ్మ సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలి






### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్ 15.26**

కామారెడ్డి జిల్లాలో జిల్లా యువజన, క్రీడల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ సంబరాలను ప్రారంభించిన అనంతరం, మహిళలతో కలిసి బతుకమ్మ ఆటలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకంగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి జరుపుకునే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించేలా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఇటువంటి వేడుకలు ప్రజల్లో ఐక్యతను, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణలో కలెక్టర్ రవితేజ, జిల్లా పంచాయతీ అధికారి మురళి, జిల్లా మద్య నిషేధ శాఖ అధికారి ముకుంద రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రంగ వెంకటేశ్వర గౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దామోదర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం - పోచారం

**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

వర్ని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండల కేంద్రంలో నిధులు 10 కోట్ల 70 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, తన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ... ఈ ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి రావడంతో వర్ని మండల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నయని తెలిపారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వైద్య అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను తగ్గించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల్లో పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని, మహిళలు, సిబ్బందితో కలిసి పండుగ వేడుకల్లో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ మాజీ చైర్మన్ కాసుల బాలరాజు వర్ని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోతుగల్‌లో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

**నేటి ప్రబాత దర్శిని,అక్టోబర్ 14 (ముస్తాబాద్-ప్రతినిధి):**

పోతుగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముస్తాబాద్ మండల వైద్యాధికారిణి డాక్టర్ అఫీజ ఆధ్వర్యంలో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీబీ యూనిట్ గంభీరావుపేట క్లస్టర్ 70 మంది టీబీ వ్యాధి బాధితులకు ఫుడ్ బాస్కెట్ పంపిణీ చేశారు . టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొనట కొరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డా .అంజల అల్ఫ్రెడ్ పిలుపు మేరకు , పీపుల్స్ హాస్పిటల్ ముస్తాబాద్, డా.శంకర్ 70 మంది క్షయ వ్యాధి గ్రస్తులను న్యూట్రీషన్ ఫుడ్ కొరకు 6 నెలలు పాటు దత్తత తీసుకున్నారు. ఇందులో ప్రతి నెల 600/- విలువ గల పప్పులు, నూనె, పల్లి, గ్రుడ్లు , ప్రోటీన్ పౌడర్ లాంటివి ఇవ్వనున్నట్లు డా.అఫీజ తెలిపారు . ఈ కార్యక్రమంలో టీబి యూ నిట్ సూపర్వైజర్ మహిపాల్ ఎస్ టీ ఎస్, టీబి నోడల్ ఎహ్ ఈ ఓ భూమయ్య, సి ఎహ్ ఓ సౌందర్య, ఎచ్ ఎస్ వరలక్ష్మి మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి. అక్టోబర్ 15.24**



గర్భిణులకు సకాలంలో పరీక్షలు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి. హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ, ముందస్తు గుర్తింపు, గర్భిణీ స్త్రీలకు అవసరమైన వైద్య పరీక్షలు, ప్రజల్లో అవగాహన పెంపునకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సంచాలకులు, కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి డా. రాకేష్ గుప్తా సూచించారు. బుధవారం నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టరేట్‌లోని తన కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, పరీక్షల ప్రాధాన్యం, ఆరోగ్య సేవల అందుబాటు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రతి గర్భిణీ స్త్రీకి నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వారికి కౌన్సెలింగ్‌తో పాటు తగిన వైద్య సేవలు అందించాలని సూచించారు. పరీక్షల ఫలితాల గోప్యతను కాపాడుతూ, అవసరమైన వారికి తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా చూడాలన్నారు. గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, వ్యాధి వ్యాప్తి, నివారణ పద్ధతులు, పరీక్షలు, చికిత్సా సేవలపై ప్రజలకు సరైన సమాచారం అందించాలని సూచించారు. వ్యాధిపై ఉన్న అపోహలు, భయాలు, వివక్షను తొలగించేలా అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సహా అన్ని సంబంధిత ఆరోగ్య సంస్థల్లో కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని తెలిపారు. నిర్వహించిన కార్యక్రమాలు, పరీక్షలు, తదుపరి వైద్య సేవలకు అనుసంధానించిన వివరాలను నమోదు చేసి, నిర్ణీత మార్గదర్శకాల ప్రకారం నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజలకు విజ్ఞప్తి: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అపోహలకు లోనుకాకుండా సరైన సమాచారాన్ని తెలుసుకోవాలని, అవసరమైనప్పుడు సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు, కౌన్సెలింగ్, వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా గౌరవప్రదంగా వ్యవహరించాలని కోరారు. - జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, కామారెడ్డి జిల్లా.

# అక్టోబర్ 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు



**కామారెడ్డి నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి**

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లాలో అక్టోబర్ 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం-2026 అమలుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి నోటీసుల జారీ, విచారణల పురోగతిని సమీక్షించి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు ఈ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హత సాధించిన వారు నిర్ణీత నమూనా-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, సవరణలకు సంబంధించి అందిన అభ్యర్థనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అర్హులైన పౌరులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, ఎన్నికల అధికారి రాజేశ్వర్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

**నేటి ప్రభాతదర్శిని భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 14 :**



ముఖ్య ఎన్నికల అధికారి గారి ఆదేశాల మేరకు, ఈ నెల 15 16. తేదీలలో జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిబిరాల సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బీూాలు) తమ తమ పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటారని కావున, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ ఓటు వివరాలు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కానివారు లిఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. అదేవిధంగా, లి18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులులి కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని పోలింగ్ స్టేషన్‌లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

TS 24 0026809 www.netiprabhatadarshini.in 94932 72754

# రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉంచాలి

**ప్రధాన కంపెనీల విత్తనాలు, ఎస్ఎస్పీ, కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలపై ఆరా**

**మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి పరిశీలన**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**నేటి ప్రభాతదర్శిని జనగామ అక్టోబర్ 14 :**

రైతులకు వ్యవసాయానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం, జిల్లాలోని పాలకుర్తి మండలంలోని ముత్తారం గ్రామంలో గల మహిళా శక్తి రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, అక్కడ రైతులకు అందిస్తున్న సేవలు, విక్రయిస్తున్న వ్యవసాయ ఉత్పాదకాలు, అందుబాటులో ఉన్న పరికరాలు, విత్తన సంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన డ్రిప్ పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారా, ఇప్పటివరకు ఎంత మంది రైతులకు డ్రిప్ పరికరాలు అందించారు? అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ నీటితో పంటలకు సమర్థవంతంగా సాగునీరు అందించేందుకు డ్రిప్ పద్ధతి ఎంతో ఉపయోగకరమని, రైతులకు ఈ పరికరాలపై అవగాహన కల్పిస్తూ వాటి వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. అలాగే, రైతు సేవా కేంద్రంలో ప్రధాన కంపెనీలకు చెందిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయా? రైతులకు వాటిని విక్రయిస్తున్న విధానం ఎలా ఉందనే అంశాలను పరిశీలించారు. పంటల సాగుకు అవసరమైన ఎస్ఎస్పీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు, విక్రయాల గురించి ఆరా తీశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల వ్యవసాయ రంగంలో భాగస్వాములవుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఏఓ అంబికా సోనీ, ఎంపీడీవో వేదవతి, ఏడీఏ అపర్ణ, ఎంపీఓ మల్లిఖార్జున, ఎంఏఓ విద్యాసాగర్, ఏఈఓ మహేష్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు

**యాసంగి పంటల సంరక్షణకు మంత్రి తుమ్మల సూచనలు**

**పంట అవశేషాలను కాల్చకుండా రైతుల్లో అవగాహన**

**డిజిటల్ వ్యవసాయంలో ఉపగ్రహ సాంకేతికత, కృత్రిమ మేధ**

**70 లక్షల మంది రైతులకు ఎరువుల వినియోగంపై సూచనలు**

**నేల ఆరోగ్యం, సాంకేతికత కచ్చితత్వానికి ప్రాధాన్యం**



**హైదరాబాద్, అక్టోబర్ 14 (నేటి ప్రభాత దర్శిని) :**

తెలంగాణలో వ్యవసాయ సంసిద్ధతను బలోపేతం చేయడంతో పాటు డిజిటల్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టి సారించారు. సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పంటల పరిస్థితులు, ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, వ్యవసాయ యాంత్రీకరణ, గిడ్డంగుల నిర్మాణం తదితర అంశాలను పరిశీలించారు. రాబోయే యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వరి సాగు తగ్గే అవకాశం, పశుగ్రాస కొరత ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత రబీ సీజన్‌లో సుమారు 18 లక్షల ఎకరాల్లో పంట అవశేషాలను కాల్చివేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుత వానాకాలం పంట కోతల అనంతరం అవశేషాలను కాల్చకుండా రైతుల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వాటిని పశుగ్రాసంగా వినియోగించేలా ప్రోత్సహించాలని, అవసరమైన ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్లు పశుగ్రాసాన్ని సేకరించి రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. మరోవైపు జర్మనీకి చెందిన ఏసీఆర్ఏటీ ప్రతినిధులతో డిజిటల్ వ్యవసాయంపై చర్చించారు. ఉపగ్రహ సమాచారం, కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి నేలలో నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాల లభ్యతను అంచనా వేయడంతో పాటు పంటల వారీగా ఎరువుల వినియోగంపై సూచనలు అందించే అవకాశాలను పరిశీలించారు. ఈ సాంకేతికత ద్వారా సుమారు 70 లక్షల మంది రైతులకు ప్రతి 12 రోజులకు ఒకసారి ఎరువుల వినియోగంపై సలహాలు అందించే అవకాశం ఉందని సమావేశంలో వివరించారు. దీనివల్ల నేలలో పోషకాల లోపాలను గుర్తించడంతో పాటు అవసరానికి మించి ఎరువుల వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. అయితే ఈ విధానాన్ని అమలు చేయడానికి ముందు దాని కచ్చితత్వం, విశ్వసనీయత, తెలంగాణలోని విభిన్న నేలలు, పంటలకు అనుకూలతను శాస్త్రీయంగా పరిశీలించాలని మంత్రి సూచించారు. సాంకేతికత ఆచరణలో ఎంతవరకు ఉపయోగపడుతుందో అధ్యయనం చేసేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు జర్మనీ ప్రతినిధి బృందంతో కలిసి పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బి. గోపి, సహకార శాఖ కమిషనర్, హాకా, ఉద్యానవన శాఖ, గిడ్డంగుల సంస్థ, అగ్రోస్ ఉన్నతాధికారులు, వ్యవసాయ, ఉద్యానవన విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు. జర్మనీ ప్రతినిధి బృందానికి చెందిన డాక్టర్ రఘు చలిగంటి, డాక్టర్ సెబాస్టియన్ బోస్, జాన్ రెడ్‌లిచ్‌తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణతో కూడిన పరిపాలన అందించాలి - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ఉద్యోగుల హాజరును 'మీ ప్రమాణం' యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి**

**పెండింగ్ కోర్టు కేసులు, ఆర్టీఐ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదులు, ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలి**

**జిల్లా అధికారుల టూర్ డైరీలను ప్రతి నెలా సమర్పించాలి**



**నేటి ప్రభాతదర్శిని పెద్దపల్లి, అక్టోబర్ 14:**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో క్రమశిక్షణతో కూడిన పరిపాలన అందించాలని, ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరయ్యేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే. అరుణశ్రీ, బి. శ్రీరాములుతో కలిసి వివిధ పరిపాలన అంశాలపై జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి సమయానికి విధులకు హాజరుకావాలని, ఉద్యోగుల హాజరును అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి 'మీ ప్రమాణం' యాప్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగుల హాజరును ఈ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా అధికారులు తమ పర్యటనలకు సంబంధించిన టూర్ డైరీలను ప్రతి నెలా తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. విధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులు, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదులు, ఇతర పెండింగ్ ఫైళ్లను నిరంతరం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ అంశాల పరిష్కారంలో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యాలయ భవనాలు, పరిసరాల పరిశుభ్రతను కాపాడటం సంబంధిత అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం చర్యలు చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పరిపాలనాపరమైన అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో అందరూ జిల్లా అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# చందుర్తి టిఆర్టీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఈగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బండ నరసయ్య ఎన్నిక

**పీఆర్సీని 60 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి.**

**టిఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్‌లి**





**నేటి ప్రభాతదర్శిని చందుర్తి అక్టోబర్ 13 :**

తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ చందుర్తి మండల శాఖ సమావేశం మంగళవారం చందుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశానికి టిఆర్టీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో పలువురు సభ్యులు ఉపాధ్యాయుల సమస్యలు, సంఘ బలోపేతం తదితర అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన నూతన మండల కార్యవర్గ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా ఈగ శ్రీనివాస్ (హిందీ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్ నర్సింగాపూర్), ప్రధాన కార్యదర్శిగా బండ నరసయ్య (హిందీ స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్ఎస్ జోగాపూర్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఉపాధ్యక్షులుగా చిందం లక్ష్మణ్ (స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ సైన్స్, నర్సింగాపూర్), పల్లెవేణి రమేష్ (స్కూల్ అసిస్టెంట్, చందుర్తి), జిల్లా కౌన్సిలర్లుగా గంగ భవాని, జ్యోతి రాణి, కార్యదర్శిగా చిలుముల కవిత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, పరిశీలకుడిగా రాష్ట్ర బాధ్యులు పోతుగంటి రమేష్ వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు నివేదికను తెప్పించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించి, 60 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను నివారించేందుకు వెంటనే విద్యా వాలంటీర్లను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, బోయన్నగారి నారాయణ, పోతుగంటి రమేష్, ఈగ శ్రీనివాస్, బండ నరసయ్య, చిందం లక్ష్మణ్, మంచి కట్ల గంగాభవాని, చిలుముల కవిత, జ్యోతి రాణి, చిలకపాటి రాజశేఖర్, శ్రీరాముల సతీష్, పల్లెవేణి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి : జిల్లా కలెక్టర్ కె. హైమావతి





**నేటి ప్రభాతదర్శిని సిద్దిపేట అక్టోబర్ 14**

జిల్లాలో బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులకు ఆదేశించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, ఎర్రచెరువు, మచ్చవానికుంటా, నర్సాపురం చెరువు, రంగదాంపల్లి చెరువుల వద్ద సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను జిల్లాలో క్రితం కంటే ఈ ఏడాది అంగరంగ వైభవంగా సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కోమటి చెరువు వద్ద పారిశుద్ధ్యం నిర్వహణ లోపాలు లోపాలు ఉండడం వల్ల నిర్వహణ ఇన్చార్జిలు, టూరిజం డిపార్ట్మెంట్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పండుగ బతుకమ్మ అని సద్దుల బతుకమ్మ వరకు పూర్తిస్థాయిలో పారిశుధ్యంతో పాటు నిర్వహణ సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. టూరిజం అధికారి కలెక్టరేట్ కి రావాలని టూరిజం శాఖ సిబ్బందిని హెచ్చరించారు. టూరిజం మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పగడ్బందీగా కోమటి చెరువు పై ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. చెరువుల వద్ద మహిళలు, పిల్లలు, పెద్దలు లోపలికి వెళ్లకుండా సైన్ బోర్డులు పెట్టాలని, ప్లాస్టిక్ బాటిల్స్, ఇతర వస్తువులు ఎక్కడపడితే అక్కడ వేయకుండా డస్ట్ బిన్ ఏర్పాటు, సద్దుల బతుకమ్మ వరకు మిగతా రోజుల వరకు స్థానిక మహిళలు వేసే చిన్న బతుకమ్మను వ్యర్థాలను ప్రతి రోజు శుభ్రం చేయాలని, మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రహదారుల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. మహిళలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. బతుకమ్మ నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన బారికేడ్లు, లైటింగ్, వైద్య సదుపాయాలు, అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ డిఈ ప్రేరణ, సిబ్బంది, పోలీస్ అధికారులు, స్థానిక వార్డు ఆఫీసర్లు తదితరులు ఉన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం సిద్దిపేట జిల్లా వారిచే జారీచేయనైనది.